మన కళ్ల ఎదుటనే జరుగుతున్న చరిత్ర—

కాని మనమంతా కళ్లు మూసుకుందాం

# ఆఖరి ప్రయాణం

ఈగంకి వెంకటరావు

మద్రాసునుంచి వాల్తేరుపోయే ప్యాసింజరు అనపర్తి స్టేషనులో ఆగింది. బియ్యపు మూటలు వెనకనించి, పక్కలనించి కొల్లలు కొల్లలుగా మనుష్యుల భుజాలు ఎక్కివస్తున్నాయి. పది సంవత్సరాల వయస్సు దగ్గరనించి ఏభై ఏళ్ల వరకూ ఆడ, మగ విచక్షణ లేకుండా అందరూ మూటలు తెచ్చారు. అంతా టిక్కెట్టు కొన్న వాళ్లే. మా పెట్టెలో పదిమంది ఎక్కారు. పరుగెత్తుకుని వచ్చి కంగారుతో ఎక్కడం వల్ల అంతా ఆవిర్లు వదులుతున్నారు. ఆ మూటలు రైల్లో పారేశారు; అంతే ఎవరి కాలిమీద పడేశారో, ఎవరి భుజంమీద పెట్టారో వాళ్లకే తెలియదు. వాళ్లు మాత్రం చేతికి దొరికిన బల్ల చెక్క, చేతికి దొరికిన యినపకమ్మీ, యిదివరకు నిలబడినవాడి భుజం యిలాగ్గా ఏమాత్రం ఆధారం దొరికినా పట్టుకు నిలుచున్నారు.

'ఏయ్, ఎవరీమూట, కళ్ళున్నాయా లేవా' అని ఎవరైనా గదమాయిస్తే 'బాబ్బాబు యీ పక్క టేకసీలోన సరుదుకుంటాం, యిలాగ్గా తమరు దానిమైన కూకోండి' అని ఏ స్త్రీ కంఠమో, బాలుడి కంఠమో వినవస్తుంది. ఇది నిత్యమూ, పడమటి నుంచి తూర్పుకు పోయే ప్రతీరైలుకూ జరిగే మామూలు సంఘటన. విశాఖపట్నంలో బియ్యం లేవు. దొరకవు. ప్రభుత్వంవారు తెప్పించి ప్రజల కిప్పించేవి చాలవు. అందుకనే తూర్పుగోదావరి నుంచి యీ అనధికార రవాణా.

రైలు నడుస్తూంటే జనం సర్దుకున్నారు, కుదించిన బస్తాలో సరుకులాగ. బల్లలమీద నిలబడ్డవాళ్లు కొందరు లోపలికి వచ్చారు. ఒక మూలనించి "సామాన్యమటోయి, సద్గురునీ సేవ సామాన్యమటోయి" అని బిచ్చగత్తె గొంతుక వినిపిస్తోంది.

మేము కూర్చున్న బల్లదగ్గరకు ఒక ఆడ మనిషి రెండు వెదురుబద్దలు పట్టుకుని వచ్చింది. "బాబ్బాబు ఒక్కపాలి నెగండి యీ మూటలు సరుదుకుంటాను" అని బతిమాలింది మమ్మలి నందరినీ ఉమ్మడిగా. మా బెంచీమీద కూర్చున్న షావుకారు గుడ్లెర్రజేశాడు. "ఏటీ మనిషీ, పిచ్చా, వెర్రా, ఎక్కడ సర్దుతుంది, బల్లకింద పెట్టెలున్నాయి. మా పెట్టెలుగానీ అవతల పారెయ్యమన్నా వేంటి?" అన్నాడు.

"అమ్మమ్మా అంతమాట అనకండి నాయన గోరు నాను సరుదుకుంటాను గద బాబయ్యా. ఒక్కపాలి నెగండి" అంది.

ఆ పక్కనున్న రైతు షావుకారుకి నచ్చ జెప్పాడు. ముష్టిదాని పాట వింటూ డబ్బు యిద్దామా, మానేద్దామా అని ఆలోచిస్తున్న ఒకాయన, పత్రిక చదువుకుంటూన్న మరో యిద్దరూ నేను, అంతా లేచాము మేము లేవగానే ఆ మనిషి బల్లచెక్క ఎత్తి కిటికీలవైపు మడిచింది. ఆ చెక్క పడిపోకుండా రైతు పట్టుకున్నాడు. బల్లకింద వున్న అడ్డు చెక్కలమీద నిలువుగా తను తెచ్చిన వెదురు బద్దలు పేర్చింది. ఆ వెదురు బద్దలమీద రెండుసేర్ల మూటలు ఒక అరడజను పేర్చింది. ఆ తరువాత బల్ల చెక్క దించేసి 'బాబు కూకోండి. మహా ప్రభువులు రచ్చించారు!" అంది. 'ఈ మనిషికి యీ చిన్న మాట లేడివి?' అన్నాడు షావుకారు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ.

"ఎక్కడి వేంటండీ ఆ పెద్ద బస్తాల్లో పన్నీ చిన్నమూటలే" అన్నాడు రైతు.

ఆ ఆడమనిషి మా పెట్టెలోవున్న ప్రతీ బల్ల దగ్గరకూ వెళ్లి బల్లమీద కూర్చున్నవారిని ఒక సారి లేవమని బతిమాలుతోంది. కొంతమంది కసురుతున్నారు, కొంతమంది చీదరించుకున్నారు.

చివరికి ఎలాగైతేనేం 'త్వరగా కానీ, నీ ఏడుపేదో' అని విసుక్కుని లేచారు. ఆ మనిషి ఆ బల్లలక్రింద గూడా చిన్న బియ్యపు మూటలు దాచింది. నాలుగో బస్తాతో మూటలు సర్దటానికి సిద్ధమవుతూండగా టిక్కట్టు యినస్పెక్టరు వచ్చాడు.

'ఏయ్ అమ్మో నీ టిక్కట్టు చూపించు' అన్నాడు. ఆమనిషి టిక్కట్టు యిచ్చింది. దాని మీద పెనసలుతో పిచ్చిగీతలు గీసి యిచ్చేశాడు.

"ఎన్ని మూటలు తెచ్చావ్ యీ వేళ?" అన్నాడు.

"ఇదొక్కటే బాబు."

"నిజం చెప్పు. యిదొకటేనా?"

"తమ పాదాలసాచ్చి యిదొక్కటేనండి."

"అయితే రూపాయి పావలా ఇయ్యి, రశీదు రాసిస్తా."

"బాబు, నాకాడ ఒక్క రూపాయే వుందండి."

"ఒక్క రూపాయే వుంటే ఎలాగ? నా చేతిది పెట్టుకోమన్నావా? ఈరైలు నీ తాతగారిదనుకున్నావా ఏమిటి? బరువు తూచకుండా పడవెయ్యడానికి? అయినా బియ్యాలు, పప్పులు రైళ్లో వెయ్యడానికి వీలు లేదు. తుని స్టేషనులో ఎలాగైనా దింపేస్తారు. నేను మంచివాణ్ణి గాబట్టి నిన్ను యిక్కడే యీ బియ్యంతో దింపటం లేదు. రూపాయి పావలా యిస్తే వుంచు. లేకపోతే మూటయిక్కడ పారెయ్యి" అన్నాడు. ఈమాట వింటువున్న షావుకారు పక్కనున్న రైతుతో అంటున్నాడు: "డూటీ అంటే అంతేనయ్యా, వెధవది కఠినంగా వుంటేనే గాని లాభం లేదు" రైతు చుట్ట నోట్లోంచి తీసేసి షావుకారు మాటలకి అంగీకారంగా పొగ పైకి వదిలాడు. ఆ ఆడమనిషి మొలలో వున్న డబ్బులన్నీ పోగుచేసి రూపాయి పావలా యిచ్చి టిక్కట్టు యినస్పెక్టరుని పంపించింది. రశీదు కాగితం మడతలుచేసి కొంగుని కట్టింది.

"రూపాయి పావలా పోతే పోయిందిగాని, మిగతా మూడు మూటలూ కనబడలేదు. నువ్వు అదృష్టవంతురాలివే" అన్నాడు షావుకారు.

పెట్టెలో వున్న జనాన్ని కలయజూస్తూ ఆ మనిషి షావుకారు మాటలకి భారంగా నవ్వింది.

"అసలు యీ బస్తాలో మూటలు గూడా దాచెయ్యాల్సిందే, మరి యీ బాబులు తొరగా నెగిసినారుగాదు. ఇట్టా డబ్బులు దానం చేసుకుంటా పోతే మాకేం మిగులుద్ది. మూణ్ణాళ్ళల్లో మట్టి గొట్టుకు పోవాల్సిందే" అంటూ 'వరే రాములూ, సోములుగాడు సరిగున్నాడా? సామర్లకోటలో దిగొద్దని చెప్పు. తుని దాటేదాకా ఆడనే కూకోమను. జాగర్తని చెప్పు నాయనా" అంది.

"ఏంటీ మీ పిల్లోడు రైలుకింద గూకున్నాడా?" అన్నాడు రైతు.

"అవును బాబయ్యా, టిక్కట్టోలు టేశనీ లోన రైలాగినపుడు నాలుగు పావుబస్తాలు తీసుకుని కిందకు బోయిండు. తుని టేశనీ దాటితే కాన కోట్లో తలపాగ ఏశాసున్నమాటే. దొరికితే గొడ్డుల్ని బాదినట్టు బాదుతారు నాయన్నారా" అంది దీనంగా.

"నీ పేరేం పేరమ్మా" అంది ఆ పక్కనే వున్న ఒక ముసలావిడ.

"నా పేరప్పయమ్మమ్మా."

"ఏవూరు తీసుకెళుతున్నావు యీబియ్యం" అని షావుకారు అడిగాడు.

"మావూరేనండి, యలమంచిలి."

"ఈ బియ్యమన్నీ మీ స్వంతవాడుకా, లేక బ్లేకు చేస్తావా?"

"కొన్ని సొంతానికి, కొన్ని అమ్మకానికి బాబయ్యా" అంది తల గోక్కుంటూ.

"నువ్వు ఏ రేటుకి గొన్నావు యీబియ్యం" అన్నాడు షావుకారు.

"రూపాయి బేడకి మూడు సొవ్వలండి."

"ఏ రేటుకి అమ్ముతావు?"

"మాకో రేటేటండి బాబయ్యా కర్చులు కలిసి రావటానికి, మళ్ళా పెట్టుబడికి కాని, లేకపోతే మేము సాధారణంగా అమ్మవండి. వారంరోజులు యిట్టా తిరిగితే, మా అదృష్టం బాగుంటే ఏ రెండు, మూడురోజుల్లో దాటి పోతామండి. మిగతా నాలుగయిదు రోజుల్లో బియ్యం ఆఫీసర్లకి వొగ్గేసి వారేసోతామండి. పోయిన బియ్యం పోగా దెబ్బలు కూడా తినాల. లేకపోతే జైల్లో కూకోవాల."

పేపరు చదువుతున్నాయన పేపరు చేతిలో పట్టుకునే ఈ మాటలు వింటున్నాడు. షావు

కారు ఆయనవైపు తిరిగి "ఏమండీ యీ ఆఫీసర్లు యిలా పట్టుకున్న బియ్యాల్ని ఏం చేస్తారంటారు?"

"ఏం చేస్తారు? రేవను కొట్టుకి అమ్మమని యిచ్చేస్తారు. ఆ వచ్చినడబ్బు ట్రెజరీలో కట్టేస్తారు. సన్నబియ్యం వుంటే అంతా పంచుకుని తినేస్తారు." అన్నాడు ముక్తసరిగా మూడు ముక్కల్లో.

"ఏంటోనండి యీ కంట్రోళ్ళు ఎప్పుడు పోతాయోగాని ప్రజల్ని మాడిచేస్తున్నారు. గాంధీగారు చచ్చిపోయేముందు బలవంతాన్ని యీ కంట్రోళ్ళు తీయించేశారు. ఆయనా చచ్చిపోగానే మళ్ళీ మనకంతాలు బిగించేశారు." అన్నాడు షావుకారు లోలోపల యీకంట్రోళ్ళకు సంతోషిస్తూనే.

"కంట్రోళ్ళు ఒకవిధంగా మంచివేనండీ. లేకపోతే వర్తకులంతా ధరలు పెంచేస్తారు. ఈ జిల్లా సరిహద్దు నిబంధనలున్నాయే, అవిమాత్రం తొలగిస్తే ప్రజలు సుఖపడతారు. విశాఖపట్నం జిల్లాలో సరిగా పంటలు పండవు. ఆ పక్కనే వున్న తూర్పు గోదావరిలో బాగా పండుతాయి. గవర్నమెంటే యీ జిల్లాలనుంచి ఆ జిల్లాకు పంపాలి. ప్రజలు తిండి గింజలు తెచ్చుకో కూడదు అని ఎందుకు చెప్పండి. ఎవడికి ఆకలి వేస్తే వాడు పోయి తెచ్చుకుంటాడు. విశాఖపట్నంలో బియ్యం లేక బాధపడుతూంటే, తూర్పుగోదావరి అదనపు ధాన్యం ఏ తిరువాన్కూరుకో, కొచ్చిన్‌కో పంపిస్తారు. జిల్లాకొక రేటు వుండటంమూలాన్ని లాభాలుకోసం ఆశించి వర్తకులు ఆఫీసర్లని కట్టుకుని దొంగ రవాణాలు చేస్తున్నారు. ఈ దొంగరవాణాలమీద దొంగ ఖర్చులు, దొంగ లాభాలు, అంతా దొంగతనం, బ్లాక్‌మార్కెట్, ఈ కంట్రోళ్ళు ప్రజల్లో అవినీతిని హెచ్చుచేయడం లేదూ!" అని చిన్న ఉపన్యాసం దంచాడాయన.

షావుకారు వింటున్నట్టుగానే వుండి నిద్రపోయాడు. అతని కామాటలు రుచించలేదు. షావుకారు నిద్రపోగానే పేపరు చదువుకుంటున్నాయన, ఆయన పక్కాయన రాజకీయాల చర్చ ప్రారంభించారు. ఒకాయన ప్రభుత్వాన్ని సమర్థిస్తూ వుంటే, రెండో ఆయన ఏకిపారేస్తున్నాడు. అప్పయ్యమ్మకి వాళ్ళేమిటి మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. వాళ్ళు తన బియ్యం గురించీ, రవాణాల గురించీ మాట్లాడుతున్నారనుకుంటోంది.

రైలు సామర్లకోటలో ఆగింది. మళ్ళీ కదిలింది. పెట్టెలో ముష్టివాళ్ళు ఎక్కుతున్నారు, దిగుతున్నారు. రైల్లో అమ్మకాల వాళ్ళగొడవ చాలా ఎక్కువగా వుంది. "ఆ, కాలక్షేపం బటాణీలు సాబ్. చూస్తే పిలుస్తాయ్, నోట్లో వేస్తే మాట్లాడుతాయ్ సార్" అని చెవిదగ్గర కొచ్చి గింగురు పెడుతున్నాడు.

ఆ మాట్లాడే వారిద్దరూ యీ అమ్మకాల వాళ్ల గురించి కూడా చర్చలోకి దిగారు. "ఈ అమ్మకాలదరిద్రం పోతేగాని మన రైలుపెట్టెలు బాగుపడవోయ్. టిక్కట్టు కొనుక్కున్న మనకే చోటులేక ఏడుస్తూంటే వీళ్ళు కూడా ఎందుకు మననెత్తిన ఎక్కడానికి!"

"నీకంటే బటాణీలు, అరటిపళ్లు, గారెలు, చక్కిలాలు అక్కరలేదు గాని, మరి అవి తినే వాళ్ళకూ, చిన్నపిల్లలకూ వీళ్లు అమ్మకపోతే ఎలాగోయ్" అన్నాడు ఆ రెండో ఆయన.

"విధవది అన్ని మనసులా రైలుప్రయాణంలోనే తీరాలా? ఇంటికిపోయి తినకూడదూ? వీళ్లు యిక్కడ అమ్మబట్టే యీ పిల్లలు కొని పెట్టమని గోలచేస్తున్నారు. ఈ అమ్మకాలు కిందనించి అమ్మకూడదూ, మన నెత్తిమీదే అమ్మాలా? రైల్వే అధికారులతో మొరపెట్టుకుంటే ప్రజలు సహకరించాలంటారు. ప్రజల్లో సహకారం యిలా ఏడుస్తోంది, నేను బటానీల వాణ్ణి పొమ్మంటే, నువ్వు యింకో పక్కనించి పిలుస్తావు. టిక్కట్టు యినస్పెక్టర్లు కొంచెం బీడి పప్పో, బటాణీలో నోట్లో వేసుకుంటారు గాని వాళ్ళని పొమ్మని గదమాయించరు..." అదే, ధోరణిలో ఆయన రైల్లో అమ్మకాలని తీవ్రంగా ఎదుర్కొంటున్నాడు.

ఈ మాటలన్నీ అప్పయ్యమ్మకు అర్థమవుతున్నాయి. తనని గురించి, తన బియ్యం గురించీ వాళ్లు మాట్లాడడంలేదని తెలుసుకుని సంతోషించింది. కాని రైలు తుని సమీపిస్తున్న కొద్దీ ఆమెలో ఆత్రత ఎక్కువైంది. ఆమె నాలుగో బస్తాలో మాటలు కూడా నాలుగవ సీటు కింద

నర్దివేసింది. ఇక బియ్యం పట్టుకుంటారని భయం ఆమెకి లేదు. తన కొడుకు సోములు రైలు పెట్టె కింద కూర్చున్నాడు. వాడు కనబడితే బియ్యం లాక్కోవడమే గాకుండా ఆవిధంగా ప్రయాణం చేస్తున్నందుకు జైల్లో పెడతారు. ఈవేళ యీ గండం గడిస్తే యికముందెప్పుడూ బియ్యం యీ విధంగా తీసుకెళ్ళకూడదనుకుంటోంది. ఆమె రోజూ అలాగే అనుకుంటోంది. ఆరోజు అపాయం గడవగానే మర్నాడు మళ్ళీ బియ్యానికి బయలు దేరుతోంది. రైలు ఒకస్టేషనులో ఆగింది. మూటల మీద కూర్చున్న తన కొడుకు సోములు ఎలాగ వున్నాడో చూడాలని దిగింది వెనక వైపునించి. రైలు ఆగిందిగదా అని అనుకున్న సోములు బొట్ట మోపుగా కూర్చుని జరిగిపోయిన మూటలు సర్దుతున్నాడు. ఈలోగా ఆగిపోయిన రైలు ఒక్కసారిగా వెనక్కి కదిలింది. అశ్రద్ధగా వున్న సోములు కమ్మీమీదనుంచి కింద పడ్డాడు. ఆ పడటంలో రైలు బద్దీమీద పడ్డాడు. చక్రాలు అతని దేహంమీదనుంచి నడిచాయి. తుండెం ముక్కలైంది. తన కొడుకు క్షణకాలంలో తన కళ్ళముందర తునియలై పోవటం అప్పయ్యమ్మ చూసి స్థంభించిపోయింది. వెర్రిగా అరచింది. సోములు ప్రాణాన్ని బలిగొన్నాక రైలుగూడా ఆగింది. ఇంతలో జనం పోగయ్యారు. పోలీసులు, ప్రయాణీకులు, అమ్మకాలవాళ్ళు, ముష్టివాళ్ళు అంతా మూగారు. అప్పయ్యమ్మ పెద్దపెద్ద రంకెలు వేసుకుంటూ గుండె బాదుకుంటూ ఆ ఆవరణంతా పరుగెత్తింది. ఆమె గ్రామస్థులు ఆమెను పట్టుకుని ఓదార్చడం మొదలు పెట్టారు.

చేసిన పాపం చెప్పుకుందుకు యింజను నీళ్ళ గొట్టం వైపు పరిగెత్తింది. వేడి నిట్టూర్పుగా, కన్నీళ్ళుగా యింజను ఆవిరి వదులుతూ బిగ్గరగా రోదించింది. నీళ్ళగొట్టం యింజనును ఓదార్చుతోంది. అప్పయ్యమ్మ రోదన యింజను రోదనలో కలిసిపోయింది. వారి కుటుంబం ఆకలిబాధ అంతవరకూ తెచ్చింది. శవంమీద పడి ఏడవటానికికూడా ఆమెకు అవకాశం లేకపోయింది. ఆఫీసర్లు పంచాయితీ కోసం శవాన్ని తీసుకుపోయారు. అప్పయ్యమ్మ బియ్యపు మూటలు ఎవరికి దొరికినవి వారు వశం చేసుకున్నారు. మర్నాటినుంచీ సోములు బియ్యానికి పోనక్కర లేదు.


# శుభ్రమైన చలువ....




ఉత్పత్తి చేయువారు :–

## ది ఈస్ట్ ఏషియాటిక్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్,
## మద్రాసు